అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



6

రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 270 గురువారం 22 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఫాలోఅప్ చేస్తాం

## హైదరాబాద్‌లో డబ్ల్యూఈఎఫ్ పెట్టుబడుల కొనసాగింపు సదస్సు

**ఏటా జులైలో నిర్వహణ : దావోస్ 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన**

**ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన బిజినెస్ లీడర్స్**

**అదే వేదికపై తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ ఆవిష్కరణ**

**వాణిజ్య సదస్సులో సీఎంతో సినీ నటుడు చిరంజీవి భేటీ**



హైదరాబాద్ **జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)లో జరిగే ఒప్పందాల అమలు కోసం ఇకపై ఏటా హైదరాబాద్‌లో ఫాలో-అప్ సదస్సులు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏటా జులై మాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని దావోస్ వేదికగా బుధవారం జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని అన్నారు. అందుకే ప్రతీ యేడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలో-అప్ సదస్సు నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు ఆయన సూచించారు. కాగా ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని లోరియల్ సంస్థ ప్రకటించింది. మిగతా 2లో...



## ఏడాదిన్నర తరవాత పాదయాత్ర

### ఏలూరు నియోజకవర్గ కేడర్‌తో భేటీలో జగన్ వెల్లడి

**అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం**

**కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**

**వైకాపా ఉండగా రోజుకో బటన్ నొక్కే వాడిని**

**ఇక ఏడాదిన్నర తరవాత పాదయాత్రతో ప్రజల్లో ఉంటా**

**ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమికి పరాభవం తప్పదు**

అమరావతి,**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రపై కీలక ప్రకటన చేశారు. ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర మొదలుపెడతానని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అలా దాదాపు ఏడాదిన్నరపాటు ప్రజల్లోనే ఉంటానని చెప్పుకొచ్చారు. కూటమి పాలన ఏంటో ప్రజలకు పూర్తిగా అర్థమైంది. ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వైపే చూస్తున్నారు. కేడర్ అంతా.. తప్పనిసరిగా ప్రజల్లో ఉండాలని పిలుపునిచ్చారు. ఏలూరుతోనే పాదయాత్ర మొదలవుతుందని అన్నారు. ఏలూరు నియోజకవర్గ కేడర్‌తో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి జయ ప్రకాశ్, కారుమూరి సునీల్, కార్యకర్తలు హాజరయ్యారు. నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకోవడంతో పాటు తాజా మిగతా 2లో...

## వైద్యవిద్యకు పెద్దపీట

### అన్ని వర్గాల సంక్షేమమే మా లక్ష్యం

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



జగిత్యాల,**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం,మిగతా 2లో...

## ఫోన్ ట్యాపింగ్ విచారణపై వాకబు

### కేసీఆర్‌ను కలిసిన హరీశ్‌రావు

### రాజకీయ పరిణామాలపై సమాలోచనలు



-మర్కుక్**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మంగళవారం సిట్ విచారణకు హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు.. బుధవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సిట్ విచారణలో జరిగిన పరిణామాలు, 2లో...

## 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

**రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు ఆదేశాలు**

**వెంటనేచేరాలని మున్సిపల్ శాఖ ఆదేశం**




హైదరాబాద్ **జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. 47 మందిని బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కువ కాలం ఒకే చోట పనిచేయడం, స్థానికులుగా ఉండడం వంటి కారణాల రిత్యా ఈసీ బదిలీలకు ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వెంటనే విధుల్లో చేరాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. లేనిచో నిబంధనల మేరకు తగిన చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు... నో వర్క్..నో పే !

### స్పీకర్ల మహాసభలో అయ్యన్నపాత్రుడు

**'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాలన్న అయ్యన్న**

**సభకు రాకుండా జీతాలు తీసుకోవడం సరికాదని వ్యాఖ్య**




లక్నో, **జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** శాసనసభకు ఒక్క రోజు కూడా హాజరు కాకుండా కొందరు ఎమ్మెల్యేలు జీతభత్యాలు తీసుకుంటున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. నో వర్క్.. నో 'పే' అనే విధానం చట్టసభల్లోనూ రావాలని ఆయన అన్నారు. దానికి అనుగుణంగా చట్టం చేయాలని.. దానికి సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఆయా విభాగాల్లో ఉద్యోగులు విధులకు హాజరు కాకపోతే.. సంబంధిత అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సహా వారి వేతనాలు నిలిపి వేస్తున్నారన్నారు. మరి తాము ఎన్నుకున్న ఎమ్మెల్యేలు సభకు రానప్పుడు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రజలుమిగతా 2లో...

## యువ సంపన్నుల జాబితాలో భారత్ టాప్

**యువ సెంటీమిలియనీర్ల జాబితాలో చైనా, యూకేను అధిగమించిన భారత్**

**ఈ జాబితాలో భారత్ నుంచి 201 మంది యువ పారిశ్రామికవేత్తలు**

**'ఇండియాస్ యూ40 క్యాపిటల్'గా నిలిచిన బెంగళూరు నగరం**

**జాబితాలోని 83 శాతం మంది తొలితరం వ్యాపారవేత్తలే!**

**సాఫ్ట్‌వేర్ రంగం నుంచి అత్యధికంగా 40 మందికి చోటు**



## తెలంగాణ దుర్భర పరిస్థితులకు నిదర్శనం

**ఒకేరోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**రైతులకు 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా డిమాండ్**



హైదరాబాద్,**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత ఆందోళనకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్రంనాటి సంక్షోభ పరిస్థితులు తెలంగాణవ్యాప్తంగా నెలకొని ఉన్నాయనడానికి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు రైతుల నిండు ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం ముమ్మాటికీ మిగతా 2లో...




## ఐరోపా దేశాల తీరుపై ట్రంప్ అసహనం

**అమెరికాలో ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధించాం**

**గ్రీస్ లాండ్‌పై వెనకడుగు లేదన్న ట్రంప్**

దావోస్,**జనవరి 21, :** ఐరోపా దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఐరోపా కూటమి సరైన దిశలో వెళ్లడం లేదని విమర్శించారు. పెద్దఎత్తున వచ్చే వలసలపై ఇక్కడ నియంత్రణ లేదన్నారు. మిగతా 2లో...

# ఏడాదిన్నర తరవాత పాదయాత్ర

(మొదటి పేజి తరువాయి)

రాజకీయ పరిణామాలపై ఆయన చర్చించి కేడర్‌కు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ..'కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఏ ఒక్క వర్గానికి ఏ మేలు చేయని ప్రభుత్వం ఇది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు తోడుగా వైఎస్సార్‌సీపీ ఉంటుంది. విద్యార్థులు, రైతులు, యువత, అక్కచె÷-లలెమ్మలు ఏ వర్గానికి కష్టం వచ్చినా నిలబడుతున్నాం. జెండా పట్టుకుని వారి తరపున పోరాడుతున్నాం. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగించాలి. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రతి ఇంట్లో ఇప్పుడు అదే చర్చ జరుగుతోంది. జగన్ ఉంటే, ఎలా మేలు జరిగేదన్నది ఆలోచిస్తున్నారు. ప్రభుత్వానికి మిగిలింది ఇంకా మూడేళు మాత్రమే. ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర మొదలుపెడతాను. అలా దాదాపు ఏడాదిన్నరపాటు ప్రజల్లోనే ఉంటానని అన్నారు. ఇక ప్రతి వారం ఒక్కో నియోజకవర్గ కార్యకర్తలతో భేటీ అవుతాను. అందులో ఏడాదిన్నర తర్వాత నా పాదయాత్ర మొదలుపెడతాను. దాదాపు ఏడాదిన్నర పాటు నేను ప్రజల్లోనే, ప్రజలతోనే ఉంటాను. ఈరోజు పరిపాలన చాలా అన్యాయంగా జరుగుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎక్కడైనా, ఎవరినైనా, ఏమైనా చేయొచ్చు అన్న కండకావరంతో వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పాలనంతా అబద్ధాలు మోసాలే.. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారు. పోలీస్ వ్యవస్థను కూడా దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వంపై చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు. జగన్ ఉన్నప్పుడే బాగుండేది, ఆయన ప్రతి నెలా బటన్ నొక్కేవాడు. చెప్పింది చేసే వాడు. మాట నిలబెట్టుకునేవాడు. అన్నీ ఇచ్చేవాడు అని ప్రజలంతా, ప్రతి ఇంట్లో అనుకుంటున్నారు. మన ప్రభుత్వ హయాంలో రెండేళ్లు కోవిడ్
కష్టాలున్నా ప్రజలను ఇబ్బందిపెట్టలేదు. ఏ ఒక్క పథకం ఆపలేదు. ప్రజలకు చెప్పింది ప్రతిదీ చేసి చూపాం. మాట నిలబెట్టుకున్నాం. ప్రజలంతా అన్ని వాస్తవాలు గుర్తించారు. చంద్రబాబు మాదిరిగా అబద్దాలు చెప్పడం, మోసాలు చేసే వారు ఉండరని అంతా గుర్తించారు. మరోవైపు వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారు. గవర్నమెంటు స్కూల్స్ పూర్తిగా కళ తప్పాయి. మన హయాంలో గవర్నమెంటు స్కూల్స్, ప్రైవేటు పాఠశాలతో పోటీ పడే స్థితి ఉంటే.. ఇప్పుడు అంతా రివర్స్ అయింది. నాడు మన హయాంలో గవర్నమెంట్ స్కూల్లో దాదాపు 43 లక్షల మంది పిల్లలు చదివితే, ఈరోజు కేవలం 33 లక్షల మంది మాత్రమే చదువుతున్నారు. ఇక, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎనిమిది క్వార్టర్లు పెండింగ్‌లో పెట్టారు. రూ.5600 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.700 కోట్లు ఇచ్చారు. వసతి దీవెన కింద రూ.2200 కోట్లు బకాయి పెట్టారు. ఆరోగ్య శ్రీ కనుమరుగు చేశారు. 108, 104 సర్వీసులు నిర్వీర్యం చేశారు. కోవిడ్ టైమ్‌లో కూడా అన్ని సదుపాయాలతో మనం కొత్త వాహనాలు ప్రవేశపెడితే.. వాటిని ఇవాళ పడకేయించారు. ఇప్పుడు టీడీపీకి, డాక్టర్ల వింగ్‌కు చెందిన వారికి సర్వీసులు అప్పగించారు. ఇప్పుడు ఆ సర్వీసుల కోసం ఫోన్ చేస్తే, మూడు గంటలైనా రావడం లేదన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో పెద్ద కుంభకోణానికి తెరతీశారు. మన ప్రభుత్వ హయాంలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టాం. పూర్తైన 10 మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం అచ్చంగా ప్రైవేటీకరిస్తోంది. అంతే కాకుండా ఆ మెడికల్ కాలేజీల్లో రెండేళ్ల పాటు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందట. ఒక మెడికల్ కాలేజీలో జీతాలకు ఏటా రూ.60 కోట్లు కావాలి. అలా రెండేళ్లకు రూ.120 కోట్లు ఖర్చవుతాయి. ఈ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వారికి ఇవ్వడమే కాకుండా, రెండేళ్ల పాటు జీతం కూడా చెల్లిస్తారట. అంటే కాలేజీ ప్రభుత్వానిది. అలాగే ప్రభుత్వ స్టాఫ్. ఇంకా నిర్వహణ ఖర్చు ప్రభుత్వానిది. కానీ, లాభాలు మాత్రం ప్రైవేటువారికి వెళ్తాయి. ఇలాంటి స్కామ్‌కు పాల్పడిన వారిని, మేము రాగానే రెండు నెలల్లోనే చర్య తీసుకుంటామనగానే.. ఆ కాలేజీలు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా నాశనం చేశారు. చివరకు ఎరువులు కూడా బ్లాక్‌లో కొనాల్సి వస్తోంది. అత్యంత కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు పూర్తిగా నాశనం కాగా, తాజాగా నాలుగో వ్యవస్థ శాంతి భద్రతలను కూడా నాశనం చేశారు. రాష్ట్రంలో ఎవరికీ భద్రత లేకుండా పోయింది. ఎక్కడా పోలీసింగ్ వ్యవస్థ కనిపించడం లేదు. ఇంకా మొత్తం ప్రైవేటీకరణ.. అదే అనుకుంటే చివరకు సీఎం పదవిని కూడా ప్రైవేటుకు ఇవ్వొచ్చు కదా?. అన్నింటా విఫలమైన ప్రభుత్వం.. ప్రశ్నించే గొంతు నొక్కుతోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, కేసులతో వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రజలకు తోడుగా నిలబడుతోంది. విద్యార్థులు, యువత, రైతులు, అక్క చె÷-లలెమ్మలు.. ఎవరికి ఏ కష్టం వచ్చినా, వారందరి తరపున జెండా పట్టుకుని నిలబడుతున్నాం. గట్టిగా పోరాడుతున్నాం. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగాలి. ఆ దిశలో మీరంతా కలిసికట్టుగా పని చేయాలి' అని అన్నారు.

# ఫాలోఅప్ చేస్తాం

ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనుంది. దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డితో లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీని ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ఆయన వెల్లడించారు. ఈ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్
ఈ సందర్భంగా తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రితోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును లోరియల్ సంస్థ ఆహ్వానించింది.
హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ-టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్, జాగర్, కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులకు వివరించింది. జీసీసీతోపాటు మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్రంలోగల అవకాశాలను పరిశీలించాలని లోరియల్ సంస్థ విభాగాధిపతులను వారు ఆహ్వానించారు. తెలంగాణలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు హియెరోనిమస్ ఈ సందర్భంగా హామీనిచ్చారు.

బ్లైజ్ కంపెనీ ఒప్పందం

మరోవైపు కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ సంస్థ వ్యవస్థాపక సీఈవో దినాకర్ మునగాలా సీఎంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డేటా సెంటర్ అర్టిఫిషియల్ కంప్యూటింగ్‌కు ఈ సంస్థ తక్కువ శక్తిని వినియోగించే హార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనుంది. బ్లైజ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ ఇంజినీరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. తన ఆర్ అండ్ డీ సెంటర్‌ను విస్తరించేందుకు వీలుగా పెట్టుబడులు, ప్రణాళికలపై ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు సీఎంతో చర్చించారు. హెల్త్‌కేర్ డయాగస్టిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి రంగాల్లో ఏఐ ద్వారా పరిష్కారాలను కనుగొనటం, వాటిని పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేసేందుకు ఉండే అవకాశాలపై వారు సమాలోచనలు చేశారు.
అనంతరం సీఎం మాట్లాడుతూడ తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దటమనేది వచ్చే రెండు దశాబ్దాల్లో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, హార్డ్‌వేర్, ఆటోమేషన్ రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశంలోనే టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. బ్లైజ్ సంస్థకు సంబంధించిన ఆర్ అండ్ డీ యూనిట్ విస్తరణకు ప్రభుత్వం తగిన మద్దతునిస్తుందని హామీనిచ్చారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని వివరించారు. రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తమ ప్రభుత్వం ఆకర్షించిందని చెప్పారు. 'ప్రతీ యేడాది మేము ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్‌కు వస్తాం.. కానీ ఈసారి గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో, తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చాం" అని తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా మారిందని వివరించారు.
మూసీ నది పునరుజ్జీవనంతోపాటు రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయటం ద్వారా నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి సారిస్తామని చెప్పారు. తద్వారా దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ తెలంగాణ నెక్ట్స్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీలను ఆవిష్కరించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిడ హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు, కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్-చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ అర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణకు అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాలపరంగా గ్లోబల్ కంపెనీల సహకారం స్వీకరిస్తామని వారు తెలిపారు.

## ఐరోపా దేశాల తీరుపై ట్రంప్ అసహనం

(మొదటి పేజి తరువాయి)

స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరుగుతున్న 'ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొని ప్రసంగించిన ఆయన.. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో అద్భుతంగా దూసుకెళుందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేశామని, ప్రపంచ ఆర్థిక ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందన్నారు. ఈ సదస్సుకు హాజరైన ఎంతో మంది మిత్రులు, కొందరు శత్రువులకు శుభాకాంక్షలు. నన్ను ఎన్నుకున్నందుకు అమెరికా ప్రజలు సంతోషంగా ఉన్నారు. రెండేళ్ల క్రితం మాది నిర్జీవ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇప్పుడు మళ్లీ సజీవంగా మారింది. ఐరోపాలో కొన్ని ప్రాంతాలకు ఇంకా గుర్తింపు లేదు. ఈ ఖండం అంటే నాకు చాలా ఇష్టం. కానీ, అది సరైన దిశలో వెళ్లడం లేదు. గతంలో జరిగిన నష్టాలను పునరుద్ధరించుకునేందుకు విదేశాలపై సుంకాలు పెంచుతున్నాం. ఇప్పటికే చాలా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం అని వివరించారు. అమెరికా వృద్ధిపథంలో దూసుకెళ్తోంది. ఎంతో కాలం వెనెజువెలా కూడా అద్భుతంగా ఉండేది. కానీ, సొంత విధానాలతో వాళ్లకు వాళ్లే నాశనం చేసుకున్నారు. దాడి తర్వాత మాతో డీల్ కుదుర్చుకున్నారు. విండ్‌మిల్స్‌ను తయారు చేసి ఐరోపాకు అమ్ముతున్న చైనా భారీగా లాభాలు పొందుతోంది. పక్షులకు హాని కలిగించే, ప్రకృతిని నాశనం చేసే వాటిని తెలివితక్కువ వారే కొంటారు. ఎనర్జీతో నగదు సంపాదించుకోవాలి కానీ కోల్పోకూడదు అని ట్రంప్ హితవు పలికారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సామ్రాజ్యవాద ధోరణిని కొనసాగిస్తున్నారు. ఇటీవలే వెనిజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి.. అక్కడి ప్రభుత్వాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకున్న ట్రంప్.. ఈసారి దావోస్ సదస్సులో గ్రీన్‌లాండ్‌ను హస్తగతం చేసుకుంటామని తేల్చి చెప్పారు. ప్రపంచ నేతల ముందే తాము మంచుముక్కను మాత్రమే అడుగుతున్నామని, అది కూడా గ్రీన్‌లాండ్‌కు రక్షణకోసమేనని ఆయన అన్నారు. అంతేకాదు ప్రపంచ ఆర్థిక సదస్సు సాక్షిగా 'భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని నేనే ఆపాను' అని ట్రంప్ పాత పాటే మళ్లీ పాడారు.
ఈ ప్రపంచంలో గ్రీన్‌లాండ్‌ను సురక్షింతంగా చూసుకోగల దేశం అమెరికా మాత్రమే. వ్యూహాత్మక స్థావరమైన ఈ దేశాన్ని మేము కొనేందుకు సిద్దంగా ఉన్నాం. మా ప్రతిపాదనకు అవును, కాదు అని ఎంతమంది చెబుతారు. ఏదిఏమైనా అమెరికా మాత్రం గ్రీన్‌లాండ్‌ను వదులుకోదు. ఇక నాటోకు మేము చాలా నిధులు ఇస్తున్నాం. కానీ, బదులుగా మెరికాకు ఏమాత్రం లబ్ది చేకూరడం లేదు. యూరప్ సరైన మార్గంలో వెళ్లడం లేదు. కానీ, యూరప్ సంరక్షణకు అమెరికా ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తుంది. అయితే.. వామపక్ష విధానాల కారణంగా యూరప్ శక్తిసామర్థ్యాలు దారుణంగా తగ్గిపోయాయి. గ్రీన్ ఎనర్జీ, భారీగా వలసలు.. ఆ ప్రాంతాన్ని ఘోరంగా దెబ్బతీశాయి' అని ట్రంప్ వెల్లడించారు.

## యువ సంపన్నుల జాబితాలో భారత్ టాప్

**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తల విషయంలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 40 ఏళ్లలోపు వయసున్న సెంటీమిలియనీర్ల (వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద) జాబితాలో చైనా, యూకే వంటి దేశాలను భారత్ అధిగమించింది. అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్, హురున్ ఇండియా సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో మొత్తం 505 మంది యువ వ్యాపారవేత్తలు ఉండగా, వారిలో 201 మంది భారతీయులే కావడం విశేషం. ఈ నివేదిక ప్రకారం, భారత్ నుంచి 201 మంది, చైనా నుంచి 194 మంది, యూకే నుంచి 110 మంది యువ వ్యాపారవేత్తలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. దేశంలో అత్యధికంగా బెంగళూరు నుంచి 48 మంది పారిశ్రామికవేత్తలు ఈ జాబితాలో ఉండటంతో, ఆ నగరం 'ఇండియాస్ యూ40 క్యాపిటల్'గా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 36 నుంచి 40 ఏళ్ల వయసు ఉండి, తొలితరం పారిశ్రామికవేత్తలకు కనీసం 100 మిలియన్ డాలర్లు, వారసత్వ వ్యాపారవేత్తలకు 200 మిలియన్ డాలర్ల వ్యాపార విలువ ఉన్న వారిని ఈ జాబితా కోసం పరిగణనలోకి తీసుకున్నారు. భారత్‌లో పెరుగుతున్న వ్యవస్థాపక స్ఫూర్తికి అద్దం పట్టేలా, జాబితాలోని భారతీయ పారిశ్రామికవేత్తలలో 83 శాతం మంది తొలితరం వారేనని నివేదిక పేర్కొంది. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, సేవల రంగం నుంచి అత్యధికంగా 40 మంది ఉండగా, ఆ తర్వాత హెల్త్‌కేర్ (18), రవాణా (16), ఆర్థిక సేవల (15) రంగాల వారు ఉన్నారు. ఈ యువ పారిశ్రామికవేత్తల సంస్థల మొత్తం విలువ 357 బిలియన్ డాలర్లు కాగా, ఇవి 4.43 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. 'ఈ తరం పారిశ్రామికవేత్తలు ఇప్పటికే దేశ జీడీపీ, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నారు' అని అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ అండ్ సీఈవో అపూర్వ సాహిజ్వానీ తెలిపారు. విద్యాసంస్థల పరంగా చూస్తే, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి 15 మంది పూర్వ విద్యార్థులు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. మహిళా ప్రాతినిధ్యంలో మాత్రం చైనా (29) ముందుండగా, భారత్ నుంచి 15 మంది మహిళలు ఉన్నారు.

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకునో వర్క్..నో పే !

(మొదటి పేజి తరువాయి)

ప్రశ్నిస్తున్నారని అయ్యన్న తెలిపారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలుగుతామని ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో నిర్వహించిన వివిధ రాష్ట్రాల శాసనసభాపతుల సదస్సులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అనే అంశంపై అయ్యన్న మాట్లాడారు. కొందరు ఎమ్మెల్యేలు ఒక్క చర్చలోనూ పాల్గొనలేదు. సభకు రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. అలాంటి వారిని చూస్తుంటే వేదన కలుగుతోంది. అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఉంటారా? ఇలాంటి సభ్యుల వ్యవహారశైలిని నిషేధించే నిబంధనలేవీ లేవు. చట్టసవరణ చేసి సభకు రాని సభ్యులకు 'నో వర్క్-నో పే' నిబంధన అమలు చేయాలి. అలాంటి వారిని రీకాల్ చేసేలా ప్రజలకు హక్కు కల్పించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. 2024 ఎన్నికల తర్వాత అసెంబ్లీకి ఒక్కరోజు కూడా రానివారు ఉన్నారని.. కనీసం సభలో జరిగే ప్రశ్నోత్తరాలు, చర్చల్లోనూ పాల్గొనడం లేదని ఏపీ స్పీకర్ పేర్కొన్నారు. దీనివల్ల తమను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఇలా సభకు హాజరు కాకపోవడం వలన ప్రజల దృష్టిలో సభ్యులు చులకనవుతున్నారని చెప్పుకొచ్చారు. సభకు హాజరు కాకుండానే వారు వేతనాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారంగా.. 'నో వర్క్.. నోపే' విధానానికి అనుగుణంగా చట్టం చేయాలని.. అఖిల భారత సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని కోరారు. సభకు రానివారిని రీకాల్ చేసే హక్కు ప్రజలకు కల్పించేలా చట్టం చేయాలని ఏపీ స్పీకర్ ప్రతిపాదించారు.

## ఫోన్ ట్యాపింగ్ విచారణపై వాకబు

(మొదటి పేజి తరువాయి)

అధికారుల ప్రశ్నలు.. తాను చెప్పిన సమాధానాలు తదితర అంశాలను కేసీఆర్‌కు హరీశ్‌రావు వివరించినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో జరుగుతున్న విచారణ రాజకీయ ప్రేరేపితంగా సాగుతోందని, ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలియజేసినట్టు తెలిసింది. విచారణను ఎదుర్కొవడంలో అను సరించాల్సిన వ్యూహాలపై సమా లోచనలు జరిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాబోయే రాజకీయ సవాళ్లపై కూడా ఇరువురు చర్చించినట్టు సమాచారం. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను సమగ్రంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని ఈ భేటీలో అభిప్రాయం వ్యక్తమైనట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

## తెలంగాణ దుర్భర పరిస్థితులకు నిదర్శనం

(మొదటి పేజి తరువాయి)

ఈ చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని మండిపడ్డారు. భూపాలపల్లిలో కోడెల సదానందం, మెదక్ లో దేవ్ సోత్ సర్వేశ్, ఆదిలాబాద్ లో జాదవ్ అంకుష్ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం కావడం, రేవంత్ సర్కారు మోసాలను, అబద్ధపు హామీల పేరిట చేసిన తీరని ద్రోహాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతోందని అన్నారు. రుణమాఫీ పేరిట చేసిన నయవంచనకు తోడు, పెట్టుబడి సాయానికి పాతరేయడం, చివరికి యూరియాను కూడా ఎగ్గొట్టి దిగుబడిని దెబ్బతీయడంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాత పరిస్థితి అనాథలా మారిందని అన్నారు. కేవలం రెండేళ్ల కాలంలోనే దాదాపు 900 మంది రైతులు గుండెపగిలి బలవన్మరణాలకు పాల్పడినా ఈ సన్నాసి సర్కారుకు ఇప్పటికీ సోయి రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్లు ధైర్యంగా బతికిన రైతు కుటుంబాల్లో ఇవాళ మోగుతున్న ఈ మరణమృదంగానికి రేవంత్ సర్కారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలారా.. దయచేసి ధైర్యం కోల్పోకండి. మరో మూడేళ్లు ఓపిక పట్టండని సూచించారు. ఈ వ్యవసాయ వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని, రైతు ద్రోహి రేవంత్ ను గద్దెదించుదామని.. మన తెలంగాణలో వ్యవసాయరంగానికి మళ్లీ మంచిరోజులు తెచ్చుకుందామని అన్నారు. వివరాల్లోకి వెళితే.. అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటనలు జయశంకర్ భూపాలపల్లి, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన కోడెల సదానందం (42) పోతులవాయి శివారులో తనకున్న 4 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. పెట్టుబడుల కోసం తెచ్చిన రూ.2 లక్షలకుపైగా అప్పు అలాగే ఉండిపోయింది. అప్పులు తీర్చేమార్గం లేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇం ట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు కాటారం ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బతుకమ్మతండాకు చెందిన రైతు దేవ్‌సోత్ సర్వేశ్ (57) తనకున్న ఎకరం ఐదు గుంటల పొలంలో బోరు వేశాడు. ఇల్లు కట్టి, ఇద్దరు కుమారుల పెండ్లి చేయడానికి రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎక్కువయ్యే సరికి వాటిని ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఈనెల 11న పెద్దకొడుకు అనిల్‌కు ఫోన్‌చేసి గడ్డిమందు తాగినట్టు చెప్పాడు. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి హైదరాబాద్‌లోని గాం ధీ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పి ట్‌గావ్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ అంకుష్ (33) తనకున్న మూడెకరాల్లో పత్తి, కంది సాగు చేశాడు. ఇందుకోసం అప్పులు తీసుకున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గు రైన అంకుష్ ఈనెల 18న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

## వైద్యవిద్యకు పెద్దపీట




(మొదటి పేజి తరువాయి)

రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరపున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కుర్చీకి బానిస- సమాజానికి శాపమా?

## ఐనా పర్వలేదు- కుర్చీ ఉండాలి!



ఇది నేడు రాజకీయాల్లో మాత్రమే కాదు పరిపాలనలో, విద్యలో, సంఘాల్లో, సంస్థల్లోఅన్ని రంగాల్లో వినిపిస్తున్న అప్రకటిత నినాదం. పదవి కోసం త్యాగం చేయాల్సి వచ్చినా సరే, బోగానికైనా సిద్ధం అయ్యే పరిస్థితి మన చుట్టూ స్పష్టంగా కనిపిస్తోంది. విలువలు కాదు, విధానం కాదు, ప్రజలు కాదుకేవలం కుర్చీ మాత్రమే కేంద్రబిందువుగా మారిన ఈ సంస్కృతి సమాజాన్ని ఎటు తీసుకెళ్తోంది? భవిష్యత్తు తరానికి ఇది ఏం బోధిస్తోంది?
ఒకప్పుడు పదవి అంటే బాధ్యత. అధికారం అంటే సేవ. కుర్చీ అంటే ప్రజల నమ్మకానికి ప్రతీక. కానీ నేడు కుర్చీ ఒక లక్ష్యంగా మారింది. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి నైతికతను తాకట్టు పెట్టడం, సిద్ధాంతాలను తుంగలో తొక్కడం, అవసరమైతే మాట మార్చడం, వర్గం మార్చడం కూడా సాధారణమైపోయింది. నిన్న దాకా తప్పు అన్నది నేడు సరైందిగా మారిపోతోందిఅది కుర్చీ దక్కితే చాలు.రాజకీయాల్లో చూస్తే ఇది మరింత బహిరంగం. ఎన్నికల ముందు మాటలు ఒకలా, గెలిచిన తర్వాత పనులు మరోలా. ప్రజల సమస్యల కంటే పదవుల పంచకంపైనే ఎక్కువ శ్రద్ధ. పార్టీలు మారడం, వర్గాలు విడిపోవడంఇవన్నీ సిద్ధాంతాల కోసం కాదు, కుర్చీల కోసమే అన్న భావన ప్రజల్లో బలపడుతోంది. దీని వల్ల ప్రజాస్వామ్యంపై నమ్మకం క్రమంగా క్షీణిస్తోంది.ఇది రాజకీయాలకే పరిమితం కాదు. విద్యారంగంలో పదవుల కోసం అంతర్గత రాజకీయాలు, పరిపాలనలో అధికారం నిలుపుకోవడానికి రాజీ ధోరణి, సంఘాల్లో కుర్చీ వదలకుండా కూర్చునే నాయకత్వం అన్నీ ఒకే రకమైన మానసికతకు నిదర్శనం. నేను ఉంటేనే సంస్థ బాగుంటుంది అనే అహం, నా తర్వాత ఎవరూ లేరు. అనే భ్రమ ఇవే కుర్చీ బానిసత్వానికి మూలాలు. ఇలాంటి పరిస్థితి భవిష్యత్తు తరానికి ఏం నేర్పిస్తోంది? నిజాయితీ కంటే అవకాశవాదమే గొప్పదని? కష్టపడటం కంటే దగ్గరి దారులే సులభమని?
విలువలకంటే విజయం ముఖ్యమని?
ఇది అత్యంత ప్రమాదకరమైన సంకేతం. ఎందుకంటే యువత అనేది మన సమాజానికి అద్దం. వారు చూసేదే నేర్చుకుంటారు. పెద్దలు కుర్చీ కోసం సిద్ధాంతాలు మార్చుకుంటే, యువత విలువలను ఎందుకు పట్టించుకుంటుంది? నాయకత్వం అంటే త్యాగం కాదు, లాభం అని భావిస్తే, రేపటి సమాజం మరింత స్వార్థపరంగా మారుతుంది.
కుర్చీ శాశ్వతం కాదు. పదవి కాలపరిమితి గలది. కానీ వ్యక్తి పేరు, అతని విలువలు మాత్రం చరిత్రలో మిగులుతాయి. దీనిని మరిచిపోయినప్పుడే సమాజం దారి తప్పుతుంది. కుర్చీ కోసం కాకుండా, కుర్చీ ద్వారా చేసే సేవ కోసం పోటీ పడే నాయకత్వం అవసరం.ఇప్పటికైనా ఒక ప్రశ్న మనల్ని మనం వేసుకోవాలి.కుర్చీ మన కోసం ఉందా? లేక మనమే కుర్చీ కోసం ఉన్నామా?
ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం వెతికిన రోజే, భవిష్యత్తు తరానికి ఒక మంచి దారి చూపించినవాళ్లమవుతాం. లేదంటే, కుర్చీకి బానిసలైన సమాజంగా మిగిలిపోవడం తప్ప మనకు మిగిలేది ఏమీలేదు.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్

# శాస్త్రీయ పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### లబ్ధిదారులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



**వర్ధన్నపేట, జనవరి 21 (జర్నలిస్ట్ వార్త)**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నాణ్యమైన ప్రమాణాలతో, శాస్త్రీయ పద్ధతిలో జరగాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సూచించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ స్వయంగా నిర్మించుకోలేని పేద లబ్ధిదారులను గుర్తించి, కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లు నిర్మించి అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
మంగళవారం మండల కేంద్రంలోని మండల గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పునాది నుండి ఇంటి నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సవివరంగా వివరించారు. తక్కువ స్థలంలో కూడా గాలి, వెలుతురు సమృద్ధిగా వచ్చేలా ఉత్తమ గృహ నమూనాలను ప్రదర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.
ప్రభుత్వం అందిస్తున్న నిధులను దుర్వినియోగం చేయకుండా, దశలవారీగా పనులు పూర్తి చేస్తూ ప్రతి పేద కుటుంబానికి పటిష్టమైన, దీర్ఘకాలిక సొంతింటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. నాణ్యమైన సామగ్రితో ఇళ్ల నిర్మాణం చేపట్టి భవిష్యత్ తరాలకు భద్రమైన నివాసాలు అందించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా శిక్షణ సబ్ రిజిస్ట్రార్ గా బి మాధవ్

### 8 ఉద్యోగాలు సాధించిన మాధవ్..
### గ్రూప్ 1 లో 36 వా ర్యాంక్..



**వైరా/జనవరి21(జర్నలిస్ట్ వార్త):**
గ్రూప్ 1 ఫలితాలలో 36వ ర్యాంక్ సాధించిన వరంగల్ కు చెందిన బి మాధవ్ మంగళవారం డిస్టిక్ రిజిస్టర్ శిక్షణలో భాగంగా వైరాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు శిక్షణ సబ్ రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ది మాధవ్ కు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. వరంగల్ కు చెందిన బి మాధవ్ విద్యాభ్యాసం మొత్తం అక్కడే జరిగింది. ఎస్సార్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన మాధవ్ 2019లో సబ్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం పొంది 2025 వరకు విధులు నిర్వహించారు. మాధవ తండ్రి పోస్ట్ మాన్ గా విధులు నిర్వహిస్తున్నారు .విద్యాభ్యాసంలో అత్యధిక మార్కులు సాధించుకుంటూ ర్యాంకులు సాధించిన మాధవ్ వరసగా 8 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. 2018లో విఆర్ఓ, గ్రూప్ ఫోర్ లో 37వ ర్యాంక్, సివిల్ ఎస్సై ,రైల్వే ఎస్సై, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ,అసిస్టెంట్ కమాండెంట్, రైల్వే ఇంజనీర్ ఇలా ఉద్యోగాలు వరుసగా సంపాదించిన మాధవ్ గ్రూప్ 1 లో 36వ ర్యాంకు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లా డిస్టిక్ రిజిస్ట్రార్ శిక్షణ లో భాగంగా వచ్చిన బి మాధవ్ వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు శిక్షణ సబ్ రిజిస్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ఊ మాధవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ధ్యేయం అన్నారు

# బోరు పనులు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు




**రాయపర్తి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని కేశవపురం, జేతురాం గ్రామాలలో ఎంపీ నిధులతో మంజూరైన బోరు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి కొబ్బరి కాయ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగు నీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ టీఎం కృష్ణమాచార్యులు,జేతురాం తండా గ్రామ సర్పంచ్ గుగులోత్ స్వప్నవిజయ్ నాయక్, కేశవపురం గ్రామ సర్పంచ్ గుజే సుధాకర్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మెర కళ్యాణ్,జేతురం తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరు నాయక్,,జేతురం తండా ఉపసర్పంచ్ రవి నాయక్,లేతాకుల రత్నాకర్ రెడ్డి,మచ్చ రమేష్,ఎండీ ఉస్మాన్,లకావత్ భాస్కర్,గుగులోతు యాకుబ్,పీరని ప్రవీణ్, నరేందర్,చిలుముల రాజశేఖర్,సంతోష్,యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన సర్పంచ్



**రాయపర్తి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సర్పంచ్ గారే సహేంద్రభిక్షపతి గ్రామ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కబ్బడి ఆడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు.సిఎం కప్ క్రీడా పోటీలలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.గ్రామీణ క్రీడాకారులు మండల స్థాయి, జిల్లా స్థాయి ,రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శర్మ,ఉప సర్పంచ్ మచ్చ రమేష్, పిడి శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి వినోద్,కారోబార్ కారుపోతుల రామచంద్రయ్య
గ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్-బంధాలకు బ్రేక్ వేసిన బొమ్మ





టీవీ వచ్చిన రోజుల్లో పెద్దలు ఒక మాట అన్నారు ఇక వీధులు ఖాళీ అవుతాయని. అది కొంతవరకు నిజమైంది. టీవీ మనుషులను వీధుల నుంచి ఇళ్లలోకి తీసుకొచ్చింది. అయినా అప్పట్లో కుటుంబం ఒకేచోట కూర్చుని ఒకే కార్యక్రమం చూసేది. మాటలు తగ్గినా, చూపులు కలిసేవి. భావాలు పంచుకునే అవకాశం ఉండేది. కానీ సెల్ ఫోన్ వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇళ్లలో ఉన్న మనుషుల మధ్యనే కనిపించని గోడలు కట్టింది.
ఒకప్పుడు సాయంత్రం అంటే సంభాషణల పండుగ. ఇంటి పెద్దల అనుభవాలు, పిల్లల అల్లరి, కుటుంబ కబుర్లు కలిసి జీవితం అనిపించేది. అరుగులపై కూర్చుని పొరుగువాళ్లతో మాట్లాడటం సహజం. కాలం మారింది. టీవీ వచ్చాక ఆ దృశ్యం కొంత తగ్గినా, కుటుంబం మాత్రం ఒకటిగానే ఉండేది. ఇప్పుడు మాత్రం సెల్ ఫోన్ చేతిలో ఉంటే చాలు. మనిషి ఒంటరివాడే జనాల్లో ఉన్నా, సంబంధాల్లో లేనట్టే.ఒకే గదిలో తల్లి, తండ్రి, పిల్లలు కూర్చుంటారు. ముగ్గురి చేతుల్లో మూడు ఫోన్లు. ముగ్గురూ మూడు ప్రపంచాల్లో జీవిస్తున్నారు. మాటలు అవసరానికి మాత్రమే. చూపులు స్క్రీన్లకే పరిమితం. బంధం ఉందా అంటే ఉంది. కానీ అనుబంధం మాత్రం కనిపించదు. ప్రేమ సందేశాలుగా మారింది. ఆప్యాయత ఎమోజీలకు పరిమితమైంది.పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు ఒకప్పుడు బంధాలను బలపరిచేవి. బంధువుల మధ్య దూరాలను తగ్గించేవి. ఇప్పుడు అవే ఫోటోలు, రీల్స్, స్టేటస్‌లకే పరిమితమవుతున్నాయి. కలిసి భోజనం చేయడంకంటే ముందుగా ఫోటో తీయడం అలవాటైంది. అనుభవాన్ని జీవించడంకంటే చూపించడమే గొప్పగా భావించే పరిస్థితి వచ్చింది.సెల్ ఫోన్ వల్ల దూరాలు తగ్గాయని గొప్పగా చెప్పుకుంటాం. నిజమే, భౌతిక దూరాలు తగ్గాయి. సమాచారం క్షణాల్లో అందుతోంది. కానీ మనసుల మధ్య ఖాళీ మాత్రం పెరిగింది. అవసరానికి మించి ఫోన్‌ను వాడటం వల్ల మనం కోల్పోతున్నది సమయం మాత్రమే కాదు సంభాషణ, సహనం, సహానుభూతి కూడా మెల్లగా మన చేతుల నుంచి జారిపోతున్నాయి.ఇక్కడ తప్పు సాంకేతికతది కాదు. దాన్ని మనం వాడుతున్న తీరు తప్పు. సెల్ ఫోన్ మన చేతిలో ఉండాలి కానీ మన మనసును ఆక్రమించకూడదు. కుటుంబంతో కూర్చున్నప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టడం కూడా ఒక సంస్కారం. మాట్లాడటం, వినటం, కలిసి నవ్వటం ఇవన్నీ ఆధునిక జీవితంలో మరిచిపోతున్న విలువలు.
నేడు నైతిక, కుటుంబ, సాంప్రదాయ విలువలు మంటగలుస్తున్నాయన్న మాట వినిపిస్తోంది. కారణం ఒక్కటే వాటిని కాపాడుకునే బాధ్యతను మనమే వదిలేయడం. సాంప్రదాయాలు ఉపన్యాసాల్లో కాదు, ఆచరణలో ఉండాలి. బంధాలు మాటల్లో కాదు, మన సమయాన్ని పంచుకోవడంలో కనివించాలి. సాంకేతికతను తిరస్కరించడం సాధ్యం కాదు. కానీ మానవత్వాన్ని కాపాడుకోవడం తప్పనిసరి. రోజులో కొద్దిసేపైనా ఫోన్‌ను పక్కన పెట్టి ఎదురున్న మనిషిని చూసి మాట్లాడగలిగితే అదే నిజమైన అభివృద్ధి. లేదంటే సెల్ ఫోన్ మన చేతిలోనే ఉంటుంది బంధాల సమాధులు కూడా అదే చేతులతో తవ్వుకున్నట్లే అవుతుంది.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే లెనిన్ సుధాకర్
9908401581

# పల్లె నుంచి ప్రపంచ స్థాయి విజేతల దిశగా సీఎం కప్

### ధర్మసాగర్‌లో గ్రామస్థాయి క్రీడా పోటీల ప్రారంభం



**ధర్మసాగర్/జనవరి21 హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ గ్రామస్థాయి క్రీడా పోటీలు బుధవారం ధర్మసాగర్ జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతిఏలియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతిఏలియా మాట్లాడుతూ, సీఎం కప్ ద్వారా గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్, 1వ వార్డు మెంబర్ సాంబరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, గర్ల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్, పి ఈ టి పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. గ్రామస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు, యువత ఉత్సాహంగా హాజరయ్యారు.



# నేడు సీఎం కప్ 2025 క్రీడలు ప్రారంభం: ఎంపిడివో వీరేశం




**భీమదేవరపల్లి/జనవరి21 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలంలో 22న గ్రామ పంచాయతీ స్థాయిలో సీఎం కప్ క్రీడలు జరుగుతాయని బుధవారం ఎంపిడివో వీరేశం తెలిపారు. అదేవిధంగా మండల స్థాయిలో 28 నుంచి 31వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో 28న వాలీబాల్, అథ్లెటిక్స్ 29న కబడ్డీ, 30న ఖోఖో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణకు భీమదేవరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాట్లు చేసామన్నారు. మండలంలో ఆసక్తి గల యువతీ యువకులుపై క్రీడాంశాలలో పాల్గొనుటకు సంబంధిత పిఇటి వద్ద, ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకుని క్రీడలలో పాల్గొనాలని కోరారు.

# గురుకుల ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు



**రాయపర్తి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి నిర్వహించే దరఖాస్తు గడువు నేటితో ముగిసింది.తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు జనవరి 21 నుండి 25వ తారీకు వరకు దరఖాస్తు గడువును పొడిగించిన్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సముద్రాల సరిత ఒక ప్రకటనలో తెలిపారు.గత నెల 11 నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయిందనీ అన్నారు.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీటు కావలసిన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలనీ కోరారు.ప్రవేశ పరీక్ష ను ఫిబ్రవరి 22న నిర్వహించినట్లు తెలిపారు.

# వన్య ప్రాణుల గణనపై అవగాహనా కార్యక్రమం

**జిల్లా అటవి అధికారి బత్తుల విశాల్.**



**,బయ్యారం/జనవరి 21(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని వన్యప్రాణుల గణన కార్యక్రమం పరిశీలించేందుకు బుధవారం జిల్లా ఫారెస్ట్ అధికారి భక్తుల విశాల్ మొట్ల తిమ్మాపురం ఈస్టు బీట్ నీల మావి తోపు రిజర్వు ఫారెస్ట్ పరిధిలో అడవిని సందర్శించి , జిల్లా అటవి సబ్ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు,మండల ఫారెస్ట్ రేంజ్ అధికారి సువర్చల ఇతర డిఆర్ఓలు రమేష్, సాంబశివరావు, రవి బీట్ అధికారులకు అటవి జంతువులు,పులుల గణన నిర్వహణపై తగు జాగ్రత్తలతో కూడిన అవగాహన ట్రైల్ పాత్ లో పాల్గొని కార్యక్రమమును నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వన్యప్రాణులు కాపాడుకుంటేనే అడిగి ఉంటుందని అడవి లేకుంటే అందరికీ అంధకారమే అని అన్నారు .ఈ కార్యక్రమంలో తిమ్మాపురం బీట్ అధికారి శంకర్,

# ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచ్ సుజనా శ్రీనివాస్



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 21 (జర్నలిస్ట్ వార్త) :**మండలంలోని తాటికొండ, జిట్టగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల మల్లన్న గండి రిజర్వాయర్ వద్ద సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద తాటి కొండ సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, జిట్ట గూడెం సర్పంచ్ బానోతు బాలు నాయక్ ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులు జాతరకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమా సుధీర్ రెడ్డి, తాటికొండ ఉప సర్పంచ్ ఎడమ కట్టమల్లు, జిట్టగూడెం ఉపసర్పంచ్ జిట్ట గూడం ఉపసర్పంచ్ లునావత్ రజిత రవీందర్, నాయకులు,బొంకూరి యాదగిరి, వక్కల రాజు, ఎండి ఆజాం, బూరుగు రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి

**- జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్ రెడ్డి**



**రాయపర్తి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు జీవితంలో అత్యంత ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్ వి బి శర్మ ఆద్వర్యంలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని,మంచి నడవడిని, ప్రవర్తనను పెంపొందించుకోవాలని అన్నారు.విద్యార్థులు తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావడానికి మంచి ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు.జీవితంలో చిన్నచిన్న తప్పిదాలకు ,ఆవేశానికి లోనై, కృంగిపడక ,ఆత్మహత్యలకు లోను కాకుండా, ధైర్యంతో మంచి మార్గంలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య,ప్రవీణ్ రెడ్డి,రోజా రాణి,రాధ,సురేందర్, శ్రీనివాస్, నరసింహ, సంధ్య, దేవేందర్,విక్రమ్,ఉమాదేవి,శోభ,అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి రక్షణ మన అందరి బాధ్యత

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్**



**నర్సంపేట జనవరి 21 (జర్నలిస్ట్ వార్త);** నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (గవర్నమెంట్ డిగ్రీ కళాశాల అటనమస్ ) లో (జనవరి 21, 2026) కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ . సి సి ఈ తెలంగాణ. వర్క్షాప్ లో నిర్ణయం లో భాగంగా, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఇన్ ఛార్జ్ డా. కందాల సత్యనారాయణ కళాశాల ఆవరణలో ఉన్న పెద్ద మర్రిచెట్టును (మర్రి చెట్టు ) కళాశాల "మదర్ ట్రీ గా ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసంగిస్తూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి గ్రీన్ ఇనిషియేటివ్స్ కింద మొక్కలు నాటడం మరియు ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దడం వంటి పనులలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు.అనంతరం విద్యార్థులు మరియు అధ్యాపకులు అందరూ కళాశాలలో ఎన్నో ఏళ్లుగా విస్తరించి ఉన్న మదర్ ట్రీ అయిన మర్రిచెట్టు చుట్టూ దాని రక్షణ నిమిత్తం మానవహారంగా నిలబడి వృక్షాల రక్షణ కోసం నినాదాలు చేశారు.

# బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**నర్సంపేట/జనవరి 21 (జర్నలిస్ట్ వార్త);**నర్సంపేట బిర్ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేత్కర్ సెంటర్ లో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ నర్సంపేట మాజీ శాసనసభ్యులు గౌరవ శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు18వ వార్డు మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం ఆధ్వర్యంలో భారీగా తరలిన 18వ వార్డు ప్రజలు.ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు,420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సంపేట అంబేత్కర్ సెంటర్ లో ప్రజా నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందిఈ కార్యక్రమంలో వార్డు ప్రచార కార్యదర్శి దంచనాదుల సతీష్, మైనార్టీ నాయకులు ఎండి జమాలుద్దీన్,పట్టణ ఎస్సీ సెల్ కోశాధికారి ఎర్నం మధుసూదన్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోలి కుమారస్వామి, దంచనాదుల రాజు,కందకట్ల సతీష్ రాములు,ఎల్లబోయిన రాజు,గుటోజు ప్రవీణ్ ,దంచనాధుల సురేష్, జాటోత్ రమేష్ ,బొల్లు చంద్రం,గాండ్ల నవదీప్,మానుక గణేష్ ,18వ వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# పేద ప్రజలను అదుకోవడమే

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం




**రాయపర్తి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**పేద ప్రజలను అదుకోవడమే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం అని ఫౌండేషన్ ఛైర్మెన్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్ ఎండీ జహంగీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం కొత్త రాయపర్తి కాలనికి చెందిన గారే లక్ష్మినర్సమ్మ,అంబేద్కర్ కాలనికి చెందిన పిరణి స్వప్న అనారోగ్యాలతో బాధపడుతుండగా వారిని పరామర్శించి ఆర్థిక సహాయాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు లేతాకుల రంగా రెడ్డి, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్,గ్రామ పార్టీ అధ్యక్షులు ముద్రబోయిన సుధాకర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రాము,వార్డు మెంబర్ గారే కల్యాణివిష్ణు, గజవెల్లి ప్రసాద్ , చందు మల్లేష్, ఎండీ అక్బర్, ఎండీ యూసఫ్, మచ్చ సత్యం, ఎనగందుల యాదగిరి, సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి, బండారి అశోక్, ఐత రవి, ఎండీ యకూబ్, ఐత జంపి, ఉబ్బని మధు, గారే యకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మన భాధ్యత కావాలి.

**- సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు.**






**సత్తుపల్లి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** వాహనం నడిపేటప్పుడు "మన వారు ఇంటివద్ద మనకోసం ఎదురు చూస్తున్నారు". అనే విషయం గుర్తెరగాలి.వాహనం నడిపేటప్పుడు మన జాగ్రత్త తో పాటు ఎదుటివారి అజాగ్రతను అంచనావేయాలి.రోడ్డు భద్రత మన అందరి బాధ్యత కావాలని సత్తుపల్లి మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ జే. ఎన్. శ్రీనివాసరావు అన్నారు.రోడ్డు భద్రత మాస ఉత్సవాలు (జనవరి 1 నుంచి 31 వరకు) సందర్భంగా సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంవీఐ మాట్లాడుతూ హెల్మెట్, లైసెన్స్ లేకుండా , సెల్ ఫోన్ మాట్లాడుతూ,మద్యం సేవించి వాహనం నడపకూడదని,వాహనం నడిపేటప్పుడు అతివేగం, అజాగ్రత్త తగదని సూచించారు.

# రోడ్డు భద్రత పట్ల అవగాహన పోటీలు.

**విద్యార్థులకు బహు మతులు.**





**సత్తుపల్లి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** రోడ్డు భద్రత పట్ల అందరికీ అవగాహన అవసరమని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు.రోడ్డు భద్రత మాస ఉత్సవాలు (జనవరి 1 నుంచి 31 వరకు) సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో విశ్వశాంతి విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో విజేతలకు అతిథులుగా బహుమతులు అందజేశారు. బహుమతులు పొందిన విశ్వశాంతి విద్యార్థులలో కౌషర్, నాగ వర్షిని, రితికఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్, లైసెన్స్ లేకుండ , సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని,వాహనం నడిపేటప్పుడు అతివేగం, అజాగ్రత్త తగదని సూచించారు.


# కాకతీయ యూనివర్సిటీలో నేతాజీ జయంతి సన్నాహక సమావేశం



**హనుమకొండ/జనవరి 21 (జర్నలిస్ట్ వార్త);**
నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని పరాక్రమ దివాస్‌లో భాగంగా కాకతీయ యూనివర్సిటీలో తొలిసారిగా ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు జనవరి 23న ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ ఆధ్వర్యంలో జరిగింది.కాకతీయ యూనివర్సిటీ ఆఫీస్ ఆఫ్ స్టూడెంట్స్ డీన్ ఎఫైర్స్, రాజనీతి శాస్త్ర విభాగం సంయుక్తంగా ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నాయి. సమావేశానికి ముఖ్య అతిథిగా స్టూడెంట్ యూత్ ఆఫీసర్ డాక్టర్ బి. నిరంజన్ హాజరై మాట్లాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను యువతకు సమగ్రంగా పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ఉపన్యాస పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యూనివర్సిటీ విద్యార్థులు నేతాజీ జీవితాన్ని లోతుగా అధ్యయనం చేసి ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి సన్మానం చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్యతో పాటు అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు పాల్గొన్నారు.అదేవిధంగా ఈ పోటీల నిర్వహణ కోసం రాజనీతి శాస్త్ర విద్యార్థులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కోఆర్డినేటర్‌గా రుబీనా (రిసెర్చ్ స్కాలర్), కన్వీనర్లుగా జి. టీన, బి. దేవేందర్‌లను నియమించారు. కో–కన్వీనర్లుగా వై. కావ్య, కె. సాయికృష్ణ, ఎం.డి. సామ్రిన్ ఖాన్, ఎన్. శ్రీరంజన, వి. రాజ్యలక్ష్మి, కె. వివేక్‌లను ఎంపిక చేశారు. మెంబెర్స్‌గా శ్రీచందన, అనూష, అన్వేష్, మేరీ సుగంధలను నియమించారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం నూతన కమిటీ సభ్యులను అభినందించింది.

# కార్పొరేషన్ ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరణ

**సమిష్టిగా కృషి చేసి కాంగ్రెస్ ను గెలిపిద్దాం**



**కొత్తగూడెం/జనవరి 21(జర్నలిస్ట్ వార్త);**కొత్తగూడెం పట్టణంలో గల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు త్వరలో జరగనున్న కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్ల నుండి పోటీ చేయు పార్టీ ఆశావాహుల నుండి టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగాసీతారాములు దరఖాస్తులను స్వీకరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో సమిష్టిగా పని చేయాలని, అధిష్టానం సర్వే ద్వారా అభ్యర్థుల ఎంపికను నిర్ణయిస్తుందని, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కదం తొక్కుదామని, ప్రజా ప్రభుత్వంలో పేదల కోసం తీసుకొచ్చిన అనేక సంక్షేమ , అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు .

# నర్సంపేట పట్టణం 22వ వార్డులో సీసీ రోడ్డు మంజూరు

## శిలాఫలకం ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి





**నర్సంపేట/జనవరి21 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలో 22వ వార్డులో నర్సంపేట శాసనసభ్యులుగౌరవ శ్రీ దొంతి మాధవరెడ్డి చొరవతో అంతర్గత సిసి రోడ్ల కోసం 62 లక్షల రూపాయలను మంజూరు చేయించి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చే శిలాఫలకాన్ని ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు బత్తిని రాజేందర్ నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, మాజీ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, చింతల సాంబ రెడ్డి, గండి గిరి గౌడ్, పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధోని కీర్తన, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రవి, ఎర్ర యాకోబు రెడ్డి, స్థానిక 22వ వార్డు పార్టీ ఇన్చార్జి బాణాల ప్రసన్న శ్రీనివాస్, పోగుల ప్రవీణ్, బాణాల భాస్కర్, తాండ్ర అశోక్, బానాల రాజేష్, గొర్రె అనిల్, బాణాల చంద్ర సిద్ధార్, బాణాల సాయిచరణ్, బోడ కృష్ణ, బోడ సంజీవ, బోడ ప్రవీణ్, ఆగారపు అరుణ, ఆగారపు జయ, గొర్రె వజ్రమ్మ కంజర్ల మంగమ్మ, బోడ సుమలత, బొచ్చు వరమ్మ, గన్నారపు అనిత, బోడ లక్ష్మి, గణిపాక కోమల, మంద హేమలత, ఆగారపు ఇందిరా తదితరులు పాల్గొన్నారు

# గ్రామస్తుల కోరిక మేరకే ఎన్టీఆర్ విగ్రహం

**తల్లాడ/జనవరి 21(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని బిల్లుపాడు గ్రామంలో నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణకు ముమ్మర ఏర్పాట్లు జరుగుచున్నవి. ముందుగా బిల్లుపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ నుంచి విగ్రహ నిర్మాణానికి , స్థల అనుమతులు, పంచాయతీ శాఖ నుండి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారపోగు. ప్రసాదబాబు అధ్యక్షతన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ విగ్రహావిష్కరణకు ప్రముఖ పాత్ర గ్రామ, మండల, తెలుగుదేశం పార్టీ నాయకులు క్రియాశీలకంగా వ్యవహరించడం జరుగుతుంది. అదేవిధంగా నందమూరి.తారక రామారావు రాష్ట్ర నలుమూలల నుంచి బి సి, ఎస్ సి, ఎస్ టి, ముస్లిం





మైనార్టీ , బడుగు,బలహీన వర్గాలకు చేసిన సేవలను మనగడులో ఉంచుకొని అతి ప్రతిష్టాత్మకంగా ఈ విగ్ర ఆవిష్కరణ ఏర్పాట్లు గట్టి సంకల్ప దీక్షతో, గ్రామ ప్రజలందరూ స్నేహభావంతో ఐక్యతతో ఏర్పాటు చేయటం జరుగుతుంది. రానున్న రోజుల్లో కూడా తెలుగుదేశం పార్టీని అధికార పీఠం వైపు తీసుకురావడానికి ప్రజానీకం ఎదురుచూస్తుందని గ్రామస్తులు కొనియాడారు. ఈ గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు చిరకాల కోరిక అని స్థలాన్ని పరిశీలించిన వారిలో టిడిపి నాయకులు ధూపాటిభద్రరాజు, ఈలపోలు కృష్ణ, రమేష్ సీతయ్య తెలియజేశారు.

# పేద బ్రాహ్మణులకు సామాజిక ఫెన్షన్ ఇవ్వాలి.

**-అర్చకత్వం విరామం లేని సేవ.**

**,బయ్యారం/జనవరి 21,(జర్నలిస్ట్ వార్త);** ప్రపంచంలో మానవ మనుగడ ఉన్నంతకాలం సనాతన ధర్మం ఉంటుంది సనాతన ధర్మం నమ్ముకుని అర్చకులు, విరామం లేని సేవ చేస్తూ వారి బ్రతుకు జీవన పోరాటం సాగిస్తున్నారని అనంతాద్రి దేవాలయ అర్చకులు విశ్వహిందూ పరిషత్తు బ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు విజయచార్యులు బుధవారం అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు సామజిక ఫెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్చకత్వం అంటే ఉద్యోగం లేకుండా విరామం లేకుండా నిత్యం ప్రజల కోసం పనిచేసే భావన మాత్రమే తీసుకొని జీవన సాగిస్తున్న దుర్భర జీవితం





గడుస్తున్న అర్చకులు అనేక బాధలలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిథి నక్షత్రాల ఆధారంగా మంచి చెడును చూసి నలుగురికి మంచిపంచే కార్యక్రమమని అన్నారు. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు శుభకార్యాలు వచ్చిన అర్చకులు లేనిదే ఆ కార్యక్రమం ముందుకు సాగదు సనాతనములో అర్చకులు చాలా వైభవంగా ఉండేవారని నేటి సమాజంలో అర్చకులను మనోవేదన బ్రతుకుతున్నారని విశ్వహిందూ పరిషత్తు బ్రాహ్మణ జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శనచార్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లవారుజాము నుండి దేవాలయాలలో దేవుడికి పూజలు, భక్తులకు దీవెనలు ఇస్తూ ఉన్నా మా సమస్యలను పట్టించుకోవడం లేదని,మూడాల,ముహుర్తాలు లేని సమయంలో అర్చకులను మందలించే వారుండరని,మిగతా సమయంలో భక్తుల కానుకల మీదే ఆదారపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అర్చకులను గుర్తించి నెల వారి పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో

# అగ్రభాగాన నిలిపే విధంగా కృషి చేస్తా

**... స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే.**

**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 21(జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపే విధంగా కృషి చేస్తానని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీపరిధిలోని చాగల్ లోని 6,7,8,9 వార్డులలో 4 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజిల నిర్మాణానికి,స్టేషన్ ఘనపూర్ లో3 కోట్ల తో సిసి రోడ్లు, డ్రైనేజిలు, గాంధీ విగ్రహం నుండి బస్టాండ్, రైల్వే స్టేషన్ వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి, శివునిపల్లిలోని 2,3,4,5 వార్డులలో 4కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజిల నిర్మా ణానికి అలాగే మున్సిపాలిటీ పరిధిలో 7 కోట్లతో వరద కాలువల నిర్మాణానికి మొత్తం18కోట్ల అభి వృద్ధి పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అదన పు కలెక్టర్ పింకేష్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడు తూ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో మొదటి విడతలో 7 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని ఈ రోజు మరో 18 కోట్ల రూపాయల అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసుకున్నామని మొత్తం25కోట్లపనులను ప్రారం భించుకున్నట్లు తెలిపారు. ఈ పనులన్నింటిని నెల రోజులలో పూర్తి చేసే విధంగా అధికారులు, కాంట్రాక్టర్లు పని చేయాలని సూచించారు. ఇంకో 25,కోట్లతోచేపట్టాల్సిన అభివృద్ధిపనులు మున్సి పల్ కార్యాలయం భవనం, టౌన్ హాల్, ఇంటిగ్రెటె డ్ మార్కెట్, వంటి పనులకు సైతం త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. 50 కోట్ల రూపాయల విలువైన ఈ పనులను పూర్తి చేయడమే



కాకుం డా మరొక యాభై కోట్లరూపాయల నిధులు కావా లని ముఖ్యమంత్రిని విజ్ఞప్తిచేసి ఎంపి,నేను అంద రం కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీనిఅభివృద్ధిలో అగ్రభాగా న నిలిపే విధంగా కృషి చేయనున్నట్లు వెల్లడించా రు. స్టేషన్ ఘనపూర్ ప్రజలు అభివృద్ధిని చూసి అండగా నిలవాలని కోరారు. అభివృద్ధి చేసే పార్టీ కి మద్దతుగా నిలిస్తే మరింత అభివృద్ధి చేసుకోవ చ్చని తెలిపారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయక త్వంలో స్టేషన్గన్పూర్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందు ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డిఓ వెంకన్న, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకు లు పోగుల సారంగపాణి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, నీల గట్టయ్య , గట్టు రమేష్, కొలిపాక సతీష్, ఇల్లందుల నరేష్, గోనెల ఉపేందర్, ఫాతి కుమార్, తోట సత్యం,ముగ్దుంపురం కిషోర్, కృష్ణమూర్తి, బాస్కుల సమ్మయ్య, కొంతం శ్రీనివాస్, మల్లేశం, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత సర్పంచ్ పై అనుచిత వ్యాఖ్యలు

**పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సర్పంచ్.**

**సర్పంచుకు న్యాయం కావాలి అంటున్న గ్రామ ప్రజలు.**



**తల్లాడ/జనవరి 21(జర్నలిస్ట్ వార్త);** మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన నూతన సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ , ఎస్సీ మాదిగ కులం, గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా గెలుపు గెలుపొందారు , దీనిలోని భాగంగా అదే గ్రామానికి చెందిన ఉప్పర్ల రామారావు, సన్నాఫ్ సైదులు, అన్నెం కోటిరెడ్డి, సన్నాఫ్ పుల్లారెడ్డి, అనే ఇద్దరు వ్యక్తులు ఎస్సీ కులానికి చెందిన సర్పంచ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు అంటూ స్థానిక తల్లాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒక మహిళనని గౌరవించకుండా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడటం ఎంతవరకు సమన్యాయం అంటూ ఎస్సీ మహిళ అంటే ఇంత చిన్నచూపా, అదే వేరే కులానికి చెందిన మహిళలను ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మీరు ఊరుకుంటారా అంటూ మీడియా ముందు కన్నీరు కార్చారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవలసినదిగా,దళిత మహిళలపై జరుగుతున్న వివక్షతను అరికట్టవలసినదిగా మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్నవల్లి గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన

**ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు**



**వర్ధన్నపేట/జనవరి21 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్‌కు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ముఖ్యంగా యువత శారీరక దృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యమే అసలైన సంపదని, దాన్ని కాపాడుకోవాలంటే ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా మారాలని అన్నారు. సామాన్య ప్రజలకు కూడా వ్యాయామ సదుపాయాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పురపాలక అధికారులు పాల్గొన్నారు.

# యునాని వైద్యశాల పరిశీలించిన సర్పంచ్.

**-శాంతి కిషన్ నాయక్**



**బయ్యారం/జనవరి 21(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మేజర్ గ్రామపంచాయతి పరిధిలోని ప్రభుత్వ యునాని వైద్యాశాలను సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ బుధవారం పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబందించిన సమస్యల గురించి డాక్టర్ శంకర్ ని అడిగి తెలుసుకున్నారు..డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ఆసుపత్రికి సంబందించి వర్షా కాలంలో స్లాబ్ కురుస్తుందని,అలాగే ఫర్నిచర్,నీళ్ల సమస్య ఉందని సర్పంచ్ కి తెలియజేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ దంపతులను డాక్టర్ శంకర్ శాలువాతో సత్కారించారు. ఈ కార్యక్రమం ఆసుపత్రి సిబ్బంది,పులి మల్లయ్య,అశోక్,మోహన్ కుమార్,దేవేంద్ర,యోగా శిక్షకులు పావని,ప్రసాద్. తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క జాతర వద్ద పనులు ప్రారంభించిన సర్పంచ్ గూగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 21(జర్నలిస్ట్ వార్త) :** చిల్పూర్ మండలంలోని ఫతేపూర్-గార్లగడ్డతండా సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా ఎన్నడు లేని విధంగా మొట్ట మొదటి సారిగా శాశ్వత పరిష్కారం ముఖ్య ఉద్దేశ్యంగా ఫతేపూర్ గ్రామ సర్పంచ్ గుగులోతు లక్ష్మి ఊమ్ల నాయక్,గార్లగడ్డ సర్పంచ్ మాలోత్ నవీన్ నాయక్ ,జాతర చైర్మన్ పురుమాని యాకులు ఆధ్వర్యంలో సమ్మక్క సార లమ్మ జాతర పనులు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తాగు నీటి సమస్య లేకుండా బోరు వేయించడం జరుగుతుందని,మేడారం నుండి వచ్చే పూజారులు గ్రామ పూజా రులకు గాను సత్రం ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. గద్దెల వెనుక భాగంలో ఉన్న చిన్న గుట్టను తొలిగించి నేరుగా సమ్మక్క సారలమ్మ తల్లివారి దర్శనంభాగ్యం కల్పించడం జరుగుతుం దని అన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గుట్ట మీదకి మునపటి కంటే వెడల్పాటి రోడ్డు వేయించడం జరుగుతుందని అన్నారు. సమ్మక్క సారలమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ, ఈసారి సమ్మక్క సారల మ్మ జాతర ఎల్లప్పుడూ గుర్తుండిపోవాలె నిర్వ హించడం జరుగుతుందన్నారు.

# సమ్మక్క సారలమ్మకు ఎత్తు బంగారం సమర్పించిన సర్పంచ్ కలకొల్ల మహేష్



**స్టేషన్ ఘన్పూర్/జనవరి 21 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ఘన్పూర్ పట్టణ కేంద్రంలో ధర్మసాగర్ మండ లం రాయిగూడెం సర్పంచ్ కలకొల్ల మహేష్ బుధవారం సమ్మక్క సారలమ్మలకు ఎత్తు బంగా రం సమర్పించడం కోసం నిలువెత్తు బంగారం ( బెల్లం) కొనుగోలు చేశారు. ఈసందర్భంగా రాయి గూడెం సర్పంచ్ కలకొల్ల మహేష్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,పాడి పంటలకు అభివృద్ధి చెందాలని అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించడం జరిగిందన్నారు. సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు, సర్పంచ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పెరుమాండ్లగూడెంలో కుటుంబ కలహం.. వృద్ధురాలి మృతి

**ఐనవోలు/జనవరి21 (జర్నలిస్ట్ వార్త);**




హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పెరుమాండ్లగూడెం గ్రామంలో కుటుంబ కలహం విషాదానికి దారి తీసింది. పొయ్యిల కట్టెల విషయమై జరిగిన గొడవలో రాయి తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందడం గ్రామంలో కలకలం రేపింది. ఐనవోలు పోలీస్ అధికారి పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పెరుమాండ్లగూడెం గ్రామానికి చెందిన కత్తుల ఐలమ్మ (చేరాలు భార్య) కుటుంబంలో పొయ్యిల కట్టెల పంపకం విషయమై వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆమె పెద్ద కుమారుడి కుమారుడు కత్తుల బన్ని, చిన్న కుమారుడు కత్తుల కొమురయ్య మధ్య వాగ్వాదం జరిగింది. గొడవ తీవ్రంగా మారడంతో ఆవేశానికి లోనైన కత్తుల బన్ని పక్కనే ఉన్న రాయిని బలంగా విసిరివేశాడు. ఆ రాయి పొరపాటున అక్కడే ఉన్న కత్తుల ఐలమ్మకు డొక్కలో తాకింది. దీంతో ఆమె స్పృహ కోల్పోయి కూలిపోయింది. తీవ్రంగా గాయపడిన ఐలమ్మను కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని మహాత్మాగాంధీ స్మారక ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కత్తుల బన్నీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞతో ఎదగాలి

## వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్



**వర్ధన్నపేట/జనవరి 21 (జర్నలిస్ట్ వార్త)**జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్యశారద ఆదేశాల ప్రకారం ఈ రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించబడింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాయిత శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల విద్యతో పాటు క్రీడలు, కలలు, సాంస్కృతిక కార్యకలాపాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలి అని సూచించారు. తోటి విద్యార్థులతో సహోదర భావాన్ని పెంపొందించి, వారి జీవితాన్ని ఒక అందమైన పుస్తకంగా తీర్చిదిద్దుకోవాలని సూచన తెలిపారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాయిత శ్రీనివాస్, విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ దశలో నేర్చుకునే వినయం, క్రమశీలతలు జీవితాన్ని ప్రభావితం చేస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల జాతీయ క్రీడా సంస్థ అధికారి నిమ్మ మనుజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు కుసుమ కుమార స్వామి, లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించడం బాధ్యతగా గుర్తించాలి

## : వర్ధన్నపేట ఎస్ఐ సాయిబాబా

**వర్ధన్నపేట/జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, ఇది మీ ప్రాణాలకు రక్షణ కవచమని వర్ధన్నపేట ఎస్ఐ సాయిబాబా పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయిబాబా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్లే అత్యధికంగా మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాకుండా, ప్రతి ఒక్కరూ తమ ప్రాణాల రక్షణ కోసం హెల్మెట్‌ను ఒక బాధ్యతగా ధరించాలని కోరారు. "హెల్మెట్ మీ రక్షణ కవచం" అనే నినాదంతో పోలీసులు రూపొందించిన పోస్టర్లను




ఆయన ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు సూచించిన హెల్మెట్‌ను బరువుగా అనుకోవద్దు: హెల్మెట్‌ను భారంలా చూడకుండా, మీ ప్రాణ భద్రతకు ఇచ్చే ప్రాధాన్యతగా గుర్తించాలి. దూరంతో సంబంధం లేదు: కొద్దిపాటి దూరమైనా సరే, వాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి. పిల్లల భద్రత కూడా ముఖ్యంమన్నారు .వాహనంపై వెళ్లేటప్పుడు మీతో పాటు ప్రయాణించే పిల్లలకు కూడా రక్షణ అవసరమని గుర్తించల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు నిబంధనలను అతిక్రమించకుండా జాగ్రత్తగా డ్రైవ్ చేయడం ద్వారా ప్రమాదాల బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చుని వివరించారు..ప్రతి వాహనదారుడు పోలీసుల సూచనలను పాటించి, సురక్షితమైన ప్రయాణాన్ని సాగించాలని, ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ సాయిబాబా పిలుపునిచ్చారు.

# రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి

**బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పయనం**

**అన్ని రకాలుగా సింగరేణి విధ్వంసం**

**ప్రభుత్వం కోరితే సిబిఐ విచారణకు సిద్ధం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

న్యూఢిల్లీ,**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ విధ్వంసం చేస్తున్నాయన్ని ÷ర్ అయ్యారు. నైనీ కోలి విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశారు. బీఆర్ఎస్ ఎలా పనిచేసిందో కాంగ్రెస్ అలానే పనిచేస్తుందన్నారు. దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా




మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్ కేటాయించారు. దానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల పక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిందన్నారు. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. సింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలని, సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఒడిశాలో బీజేపీ వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించాను. నైనీ బొగ్గు గనులకు చివరి పర్మిషన్ వచ్చాక పనులు ఎందుకు ఆలస్యం చేశారు? బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. ఆరోజు కొందరు వ్యక్తులకు లాభంగా చేకూరేలా వ్యవహరించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐదర్యాప్తు జరగాలి. రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది. సింగరేణి మైనింగ్కు ముందుకు వస్తే, చెయ్యలేమని ప్రైవేట్ కు కట్టబెట్టారు. సంస్థని బెదిరించి లేఖ రాయించారు. ఈ వివాదంలోకి నన్ను కూడా లాగుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసింది.. సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరంగా మార్చారు. సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని అన్నారు. కలో ఇండియాలో విలీనంపై మాట్లాడుతూ పరిశీలిస్తున్నామని అన్నారు. మెట్రో రెండో దశ తదితర అంవాలపైనా ఆయన తన అభిప్రాయాలు వెల్లడించారు. అందుకే సిఎంకు లేఖరాశానని అన్నారు.

# రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా

**నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం**

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

నిజామాబాద్,**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):**
శ్రీరాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడే దమ్ము బీజేపీకి ఉందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. కాంగ్రెస్ తోనే నిజామాబాద్ అభివృద్ధి సాధ్యమని అన్నారు బుధవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. వాటిపై నోటీసులు ఇస్తే బాధ ఎందుకని అన్నారు. సింగరేణి విషయంలో పస లేని ఆరోపణలు చేస్తున్నారని..
సింగరేణి కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయాంలో



జరిగినవి అని అన్నారు. ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 20 శాతం ఎక్సెస్ టెండర్లు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక అన్ని శాఖలను ప్రక్షాళన చేశామని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని అన్నారు. కేటీఆర్, హరీష్ రావులు బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. ఎన్నికల లబ్ధికోసం నోటీసులు ఇస్తున్నారనేది సమంజసం కాదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత నేరం..అలాంటి నేరం బీఆర్ఎస్ నాయకులు చేసారని.. సినీ నిర్మాత తారలు,స్వంత పార్టీ ఎమ్మెలేల ఫోన్ లు కూడా ట్యాప్ చేసారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిట్ విచారణలో రాజకీయ కక్ష కోణం ఎక్కడా లేదని.. నిజంగా తప్పు చేయకుంటే వివరణ ఇచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన సింగరేణి కాంట్రాక్టులు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెండర్లపై చర్చకు రావాలని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిఎం బంధువు సృజన్ రెడ్డిపై ఆరోపణలు చేసి దెబ్బ తీయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# హైదరాబాద్‌లో తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్

## సిఎం రేవంత్‌తో లోరియల్ సంస్థసిఇవో భేటీ

దావోస్,**జనవరి 21(జర్నలిస్ట్ వార్త):** ప్రపంచంలోనే తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ?టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని




చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ?టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్ , కోస్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ (÷ంఎఊ) గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యుఫాక్షరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.